హైదరాబాద్ వార్త

గాంధీ ఆసుపత్రి పేదలకు వరం

-క్లిష్టమైన, అరుదైన అత్యాధునిక ఆపరేషన్లు
-కార్పొరేట్ ఆస్పత్రులలో కాని ఆపరేషన్లు గాంధీలో సక్సెస్
-అస్పత్రి సూపరింటెండెంట్ కృషి ఫలితం

హైదరాబాద్, జూన్ 22 ప్రభాతవార్త

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో నురుపేద రోగులకు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తోంది. ఎంతో క్లిష్టమైన, అరుదైన ఆపరేషన్లను కూడా ఇక్కడి వైద్యులు పేద రోగులకు అందజేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులలో మాత్రమే అందుబాటులో ఉంటాయనుకున్న వైద్య చికిత్సలు, గాంధీ ఆస్పత్రిలో ఎంతో సునాయసంగా జరుపుతున్నారు. గాంధీ ఆస్పత్రికి రావాలంటేనే జంకే పరిస్థితుల నుంచి రోగులు ఇప్పుడు కార్పొరేట్ ఆస్పత్రులలో వద్యైం చేయించకుంటే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందని.. గాంధీ ఆస్పత్రిలో లక్షల రూపాయల విలవుచేసే వైద్య ఉచితంగా అందిస్తూ, క్లిష్ట పరిస్థితిలో కూడా ప్రాణాలను కాపాడుతున్నారని నమ్ముతున్నారు. అత్యాధునిక, ఎంతో ఖరీదైనా వైద్య పరికరాలను ఏర్పాటు చేసుకొని గాంధీ ఆస్పత్రి ఇప్పుడు కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా మారింది. పెద్దపెద్ద ప్రైవేట్ ఆస్పత్రులలో ఉండే అత్యాధునిక వైద్య పరికరాలను కూడా ఆస్పత్రిలో ఏర్పాటు చేసి సర్వరోగాలకు ఉచితంగా వైద్యం అందజేస్తున్నారు. గత కొన్ని వారాలుగా గాంధీ ఆస్పత్రిలో జరుగుతున్న ఆపరేషన్లు, ఇతర చికిత్సలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సంవత్సరాల కాలంగా దంపతులు పిల్లల కోసం అనేక ఆస్పత్రులలో వద్యైం చేయించుకున్నా ఫలితం దక్కకపోవడం తో గాంధీ ఆస్పత్రిలో ఐవీఎఫ్‌లో అద్భుతాలు సృష్టిస్తున్నారు.

అత్యాధునిక అరుదైన ఆపరేషన్లు...

భువనగిరి జిల్లాకు చెందిన రవి, సౌమ్య దంపతులకు వివాహమై తొమ్మిదేళ్లు అయినప్పటికీ సంతానం కలగలేదు. దీంతో వారు ఎన్నో ఆశలతో పలు ప్రైవేటు ఫర్టిలిటీ సెంటర్లను ఆశ్రయించారు. అక్కడ సుమారు 12 సార్లు ఓఐ, ఐయూఐ వంటి వివిధ చికిత్సలు చేయించుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా ప్రయోజనం లేకపోవడంతో గత ఏడాది గాంధీ ఆసుపత్రిలోని ఐవీఎఫ్ సెంటర్ను ఆశ్రయించారు. దంపతుల వైద్య చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించిన గాంధీ వైద్యులుసమస్యను గుర్తించి ఐవీఎఫ్ ప్రక్రియను ప్రారంభించారు. వైద్యుల నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేక శ్రద్ధ ఫలితంగా తొలి ప్రయత్నంలోనే ఐవీఎఫ్ విజయవంతమై సౌమ్య గర్భందాల్చింది. ఐవీఎఫ్ ప్రక్రియ ప్రారంభం నుంచి యాంటినాటల్ చెకప్పు, అవసరమైన ఖరీదైన మందులు వరకు అన్నీ గాంధీ ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా అందించారు. మే 27న సౌమ్య గాంధీ ఆసుపత్రిలోనే పండంటి మగబిడ్డకుజన్మనిచ్చింది. బిడ్డను చూసుకున్న దంపతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో లక్షలు ఖర్చు చేసినా సాధ్యం కాని చికిత్స, ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా విజయవంతం కావడం పట్ల దంపతులు ఎంతో సంబరపడ్డారు. మరో కేసులో మహబూబ్ నగర్ జిల్లా, మక్తల్ మండలంకు చెందిన 27 సంవత్సరాల ఎస్. లావణ్య గత రెండు సంవత్సరాలుగా మూడు వేర్వేరు రక్తపోటు మందులు వాడినప్పటికీ అదుపులోకి రాని తీవ్రమైన అధిక రక్తపోటుతో బాధపడ్డారు. లోతైన వైద్య పరీక్షల అనంతరం దీనికి మూల కారణం ఫియోక్రోమోసైటోమా అని తేలింది. అడ్రినల్ గ్రంథిలో ఏర్పడే ఒక అరుదైన కణితి, వైద్య పరిభాషలో ఇది శరీరంలో అధిక ఒత్తిడి హార్మోన్లను విడుదల చేసి రక్తపోటును హఠాత్తుగా, అనూహ్యంగా పెంచుతుంది. ఇలాంటి వ్యాధులు పది లక్షల మందిలో సంవత్సరానికి కేవలం ఇద్దరి నుంచి ఎనిమిది మందికి మాత్రమే వస్తుంది. ఆపరేషన్ సమయంలో రక్తపోటు క్షణాల్లో ప్రాణాంతక స్థాయికి చేరే అవకాశాలతో పాటు హృదయం, శరీర కీలక అవయవాలకు తీవ్రమైన నష్టం జరగవచ్చని వైద్యులు తెలిపారు. ఎంతో క్లిష్టమైన, ప్రాణాంతకమైన పరిస్థితులు కల్పించే ఈ ఆపరేషన్‌ను గాంధీ ఆస్పత్రిలో వైద్యులు అనేక విషమ పరిస్థితిలో విజయవంతంగా జరిపారు. మరో కేసులో మూషీరాబాద్‌లోని భోలక్‌పూర్‌కు చెందిన 22 సంవత్సరాల ఓ యువతి రెండు నెలల నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నారు. 46 సంవత్సరాల ఆమే తల్లి కిడ్నీ దానం చేయడానికి ముందుకు వచ్చింది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గాంధీ ఆస్పత్రి వైద్యులు గతనెల 27న ఆమేకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్ నిర్వహించారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్యం సాధారణ స్థితిలోనే ఉంది. మరో కేసులో నల్గొండ జిల్లాకు చెందిన 43 సంవత్సరాల మహిళ గొంతులో ఈనెల నాలుగున గొంతులో ఇరుక్కుపోవడంతో ఇబ్బంది పడ్డారు. స్థానికంగా ఉండే వైద్యులు ఆపరేషన్ అవసరమని సూచించారు. గాంధీ ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు పరీక్షలు జరిపి గొంతులో లోతుగా పదునైన ముల్లు ఇరుక్కోవడం గుర్తించారు. అత్యాధునిక ఎండోస్కోపీ విధానాన్ని ఉపయోగించి విజయవంతంగా ముల్లును తొలగించారు. ఆపరేషన్ అవసరమయ్యే ఇలాంటి పరిస్థితిలో కూడా వైద్యులు ఎండోస్కోపీ ద్వారా తొలగించడం విశేషం. ఇలాంటి అత్యధునిక, క్లిష్టమైన వైద్యం, ఆపరేషన్లు జరుపడంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి కృషి అభినందనీయమని రోగులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైద్య పరికరాలను సమకూర్చుకోవడం, విధి నిర్వహణ లో వైద్య సిబ్బంది ఖచ్చితత్వంతో ఉండడం పట్ల ప్రొఫెసర్ వాణి కృషి దాగి ఉందని చెబుతున్నారు.

కిడ్నీ మార్పిడి ఆపరేషన్ పొందిన రోగులతో వైద్యులు

నత్తనడకన 'హైచ్‌సిటీ' పనులు

-అధికారుల అలసత్వం ..భూసేకరణలో జాప్యం
-ఇప్పటికే నిధులు కేటాయింపు, టెండర్లు పూర్తి అయినా ముందుకు సాగని పనులు
-అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

హైదరాబాద్,జూన్ 22,ప్రభాతవార్త: నగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన హెచ్‌సిటీ ప్రాజెక్టులు అధికారుల అలసత్వంతో నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2024, 2025 సంవత్సరాల్లో వరుసగా ప్రకటించిన కీలక ఫ్లైఓవర్లు, ఆర్వోబీలు ఇప్పటికీ భూసేకరణ దశను దాటకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి.. నిధులు కేటాయించి.. టెండర్లు పూర్తి చేసినా.. అధికారులు మాత్రం ప్రాజెక్టులను గ్రౌండ్‌పైకి తీసుకురావడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం హెచ్‌సిటీ ప్రాజెక్టులను ప్రతిష్టాత్మకంగా ప్రకటించింది. 2024 చివర్లో కేబీఆర్ పార్క్ చుట్టూ ఏడు ఫ్లైఓవర్ లు ఏడు అండర్ పాస్ ప్రాజెక్టులు, టీవీ9 జంక్షన్ నుంచి వెంగల్‌రావు పార్క్ వరకు ఫ్లైఓవర్ ప్రతిపాదనను ప్రకటించారు. 2025 లో రసూల్ పురా వైషేఫ్ ఫ్లైఓవర్, పాటిగడ్డ ఆర్వోబీ ప్రాజెక్టులను ముందుకు తీసుకొచ్చారు. నాలుగు నెలల క్రితం మైలార్ దేవ్‌పల్లి నుంచి శంషాబాద్ వరకు ఫ్లైఓవర్ ప్రాజెక్టును ప్రతిపాదించారు. నగర భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ ప్రాజెక్టులు ఇప్పుడు ఫైళ్లకే పరిమితమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టులకు పరిపాలనా అనుమతులు, నిధుల కేటాయింపులు, టెండర్ల ప్రక్రియ పూర్తయినా.. భూసేకరణలో తీవ్ర జాప్యం నెలకొంది. రసూల్‌పురా ఫ్లైఓవర్ కోసం అవసరమైన ఆస్తుల సేకరణ పూర్తికాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. పాటిగడ్డ ఆర్వోబీ విషయంలో రైల్వే, రెవెన్యూ శాఖల సమన్వయం లేకపోవడం ప్రధాన అడ్డంకిగా మారింది. ప్రభుత్వం వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తున్నా.. ఫీల్డ్ లెవెల్‌లో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. టీవీ9 జంక్షన్ నుంచి వెంగల్‌రావు పార్క్ వరకు ప్రతిపాదించిన ఫ్లైఓవర్ ప్రాజెక్టు 2024 నుంచే చర్చల్లో ఉంది. అయితే ఇప్పటికీ భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదు.

అలాగే మైలార్‌దేవ్‌పల్లి నుంచి శంషాబాద్ వరకు ప్రతిపాదించిన ఫ్లైఓవర్ ప్రాజెక్టు ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీకి కీలకంగా భావిస్తున్నారు. మూడు నెలల క్రితం ప్రకటించిన ఈ ప్రాజెక్టు కూడా ఇప్పటికీ ప్రాథమిక దశలోనే ఉంది. మరోవైపు రసూల్‌పురా, పాటిగడ్డ ప్రాజెక్టులు ఈస్ట్ అండ్ నార్త్ సిటీల్లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించే అవకాశమున్నా.. అధికారుల నిర్లక్ష్యంతో ముందుకు సాగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ తగ్గించేందుకు రూపొందించిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. అనుమతులు,ఆస్తుల సేకరణ, శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ప్రాజెక్టులు ముందుకు కదలడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేబీఆర్ పార్క్ చుట్టూ 453 ఆస్తులు ఎఫెక్ట్ అవుతుండగా యజమానులంతా ఇక్కడ భూమి విలువ ఎక్కువ ఉంది కాబట్టి దానికి అనుగుణంగా నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయంపై హైకోర్టుకు వెళ్ళడంతో ఆస్తుల సేకరణ ఆగిపోయింది.. దీంతో ఆస్తులు ఎఫెక్ట్ అవ్వని ప్రాంతాల్లో మాత్రమే కేబీఆర్ పార్క్ ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ప్రాజెక్టులు పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నప్పటికీ.. వాటిని అమలు చేయాల్సిన అధికారులు మాత్రం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టెండర్లు పూర్తయి నెలలు గడుస్తున్నా భూసేకరణ పూర్తికాకపోవడం, ఆస్తుల యజమానులతో చర్చలు కొలిక్కి రాకపోవడం, శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల కోట్ల రూపాయల ప్రాజెక్టులు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు దొరుకుతుందోననే ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు. 2024, 2025లో ఘనంగా ప్రకటించిన హెచ్‌సిటీ ప్రాజెక్టులు రెండేళ్లు గడుస్తున్నా ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదు.

ప్రభుత్వం నిధులు కేటాయించి ముందుకు వెళ్లాలని చూస్తుంటే.. అధికారుల అలసత్వం, భూసేకరణ జాప్యం అభివృద్ధికి బ్రేకులు వేస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పెండింగ్ అంశాలను పరిష్కరించి పనులను వేగవంతం చేస్తారా..? లేక ఈ ప్రాజెక్టులు కూడా కాగితాలకే పరిమితమవుతాయా..? అన్నది వేచి చూడాల్సి ఉంది.

ఒకవ్యక్తి.. ఒకే ఓటు

- 25 జూలై 24వరకు ప్రతి ఇంటికి బిఎల్‌వోలు
-ఓటరు వివరాలు ఇవ్వాలి.. లేదంటే లిస్టు నుంచి పేరు ఔట్
-ఎన్యూమరేషన్ ఫాం తప్పుగా నింపినా..ఇవ్వకపోయినా నోటీసులు
-జూలై 31నాటికి జాబితా..సెప్టెంబర్ 20వరకు అభ్యంతరాలు స్వీకరణ
-అక్టోబర్ 1 ఓటర్ల తుదిజాబితా విడుదల
: జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్

వివరాలు వెల్లడిస్తున్న ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్, అడిషనల్ కమిషనర్ చంద్రకళ తదితరులు

హైదరాబాద్,జూన్ 22,ప్రభాతవార్త: ఒకమనిషికి ఒకేఓటు హక్కు ఉండాలనే లక్ష్యంగా ఏర్పడిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) జూన్ 25 నుండి మొదలవుతుందని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఈమేరకు సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కమిషనర్ (ఎన్నికలు) చంద్రకళతో కలిసి వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ జరగనుందని చెప్పారు. జూన్ 25 నుంచి జూలై 24 మధ్య బిఎల్‌వోలు ప్రతీ ఓటర్ ఇంటికి వస్తారని.. ఓటర్లు తమ వివరాలు చెప్పాల్సి ఉంటుందన్నారు. బిఎల్‌వో ప్రతి ఒక్క ఓటరుకు ఎన్యూమరేషన్ ఫార్మ్ ఇస్తారని.. ఓటర్లు ఫారం నింపాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ ఓటర్ అందుబాటులో లేకపోతే.. వారి ఇంటి సభ్యులు నింపి, సంతకం పెట్టి ఇవ్వొచ్చునని చెప్పారు. అలాగే ఆన్లైన్‌లో కూడా ఎన్యూమరేషన్ ఫారం పూర్తిచేయవచ్చునన్నారు తమ తల్లిదండ్రులు కానీ, గ్రాండ్ పేరెంట్స్ ఓటు హక్కుతో లింక్ చేసి అందులో ఒక్కరి వివరాలు ఎన్యూమరేషన్ ఫాం లో నింపాల్సి ఉంటుందన్నారు. అలాగే ఫాంనింపి బిఎల్‌వోలకు ఇవ్వకపోతే సర్ లిస్ట్ లో ఓటరు పేరు రాదని తెలిపారు. ఎన్యూమరేషన్ వివరాల సేకరణ పూర్తయ్యాక ఎలక్టోరల్ రోల్ డ్రాఫ్ట్ జులై 31న విడుదల చేస్తామని తెలిపారు. అలాగే సెప్టెంబర్ 28వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని ఎవరైనా ఎన్యూమరేషన్ ఫాం తప్పుగా ఫిల్ చేసినా... ఫాం ఇవ్వకపోయినా వారందరికీ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. 31జూలై నుంచి ఆగస్టు 30 వరకు నోటీసులు అందుకున్న వారు ఈఆర్‌వో వద్ద ఈసిఐ ప్రకటించిన 12 ఐడీలో ఏదో ఒకటి చూపించాల్సి ఉంటుందన్నారు. అలాగే అక్టోబర్ 1న తేదీన తుది ఓటర్ జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు.

4062మంది బిఎల్‌వోలు..

నగరంలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 4062 పోలింగ్ స్టేషన్లకు ఒక్కో స్టేషన్‌కు ఒక్కో బూత్ లెవెల్ ఆఫీసర్లను నియమించారు. మొత్తం 4062 బూత్ లెవెల్ ఆఫీసర్లను నియమించారు. ప్రతి పది మంది బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఒక సూపర్ వైజర్ ను నియమించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లతో పాటు వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులను పోలింగ్ బూత్ ఏజెంట్లుగా నియమించి, సర్ ప్రక్రియను నిర్వహించాల్సిన తీరుపై వారికి శిక్షణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ రకంగా అన్ని పార్టీలకు చెందిన సుమారు 10 వేల 901 మంది బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించారు. అయితే ఓటరు తమ వివరాలను సమర్పించటంతో పాటు 2002లో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో తన ఓటు ఎక్కడ ఉంది? పోలింగ్ స్టేషన్ నెంబర్, ఓటరు లిస్టులో ఓటు వరుస సంఖ్య వంటి వివరాలను పొందుపరిచి, డిక్లరేషన్ కూడా ఇస్తూ సంతకం చేయాల్సి ఉంటుంది. ఒకవేళ 2002లోని సర్ ప్రక్రియలో తన ఓటు లేని పక్షంలో ఓటర్లు ఆ సర్‌లో ఉన్న ప్రస్తుత ఓటరు కుటుంబ సభ్యుల్లో ఎవరి వివరాలనైనా సమర్పించవచ్చునని కూడా అధికారులు సూచించారు. ఓటరు రెండు చోట్ల వివరాలు నమోదు చేసి ఉంటే ప్రజాప్రతినిధుల చట్టం1950 సెక్షన్ ప్రకారం నేరంగా పరిగణించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేరానికి రూ.5 వేల జరిమానా గానీ ఏడాది జైలు శిక్ష గానీ విధించవచ్చునని, అవసరమైతే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించే అవకాశాలున్నట్లు వెల్లడించారు.

ప్రజావాణి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం

-ప్రతి ఆర్జీకి గ్రీవెన్స్ ఐడీ...ట్రాకింగ్ లింక్
-పురోగతిని ఆన్‌లైన్‌లో తెలుసుకునే వెలుసుబాటు
-సిఎంసి కమిషనర్ సృజన

ప్రజావాణిలో ఆర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ జి.సృజన

హైదరాబాద్,జూన్ 22,ప్రభాతవార్త: ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రతి ఆర్జీదారుడికి ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ,ట్రాకింగ్ లింక్ ఇవ్వడం జరుగుతుందని తద్వారా పౌరులు తమ ఫిర్యాదు పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం ఉంటుందని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన తెలిపారు. ఈమేరకు సోమవారం సిఎంసి ప్రధాన కార్యలయంలో జరిగిన ప్రజావాణిలో సైబరాబాద్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పౌరులు తమ సమస్యలు, వినతులు, కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా కమిషనర్ స్వయంగా వారితో మాట్లాడి వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. శాఖాధిపతుల సమక్షంలో ప్రతి వినతిని పరిశీలించి, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత శాఖలు క్షేత్రస్థాయి బృందాలతో సమన్వయం చేసుకుని ప్రతి ఫిర్యాదుపై వెంటనే చర్యలు చేపట్టాలని సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలనిసూచించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను వేగంగా పరిష్కరించడం, పారదర్శకమైన , బాధ్యతాయుతమైన పౌర సేవలను అందించడం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు. కాగా సోమవారం జరిగిన ప్రజావాణిలో మొత్తం 47 ఫిర్యాదలు అందగా అందులో టౌన్‌ప్లానింగ్ -40,ఇంజనీరింగ్-4,ఎస్టేట్ -1, పారిశుద్ధ్యం-1,అర్బన్‌బయోడైవర్సిటీ -1ఉన్నాయి.

తల్లి మందలించిందని ఇల్లు విడిచిన ముగ్గురు కూతుళ్లు
- కలకత్తా పారిపోతూ ఏలూరు వద్ద అరెస్టు

చాంద్రాయణగుట్ట, జూన్ 22, ప్రభాతవార్త : సెల్‌ఫోన్లో ఎక్కువగా గేమ్స్ ఆడుతున్నారని తల్లి మందలించటంతో ముగ్గురు మైనర్ కూతుళ్లు ఇంటి నుండి పారిపోయారు. ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇన్‌స్పెక్టర్ ఈ.జంగయ్య తెలిపిన ప్రకారం....ఫలక్‌నుమా బీబీకాచష్మా ప్రాంతానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెల్లు తరచూ మొబైల్లో గేమ్స్ ఆడుతున్నారు. రోజూ గమనిస్తున్న తల్లి వారిని గట్టిగా మందలించి చేయి చేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన ముగ్గురు అక్కాచెల్లెల్లు ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో అదను చూసుకున్నారు. ఇంట్లోంచి మూడు వేల రూపాయలు తీసుకొని కనిపంచకుండా పోయారు. నిద్రలేచిన తల్లిదండ్రులు కూతుళ్లు కనిపించకపోవంతో పరిసరాలలో, సమీప బస్తీలలో వెతికారు. అయినా లాభం లేకపోయింది. చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్.శ్రీనివాస్ స్టేషన్‌కు చేరుకొని మైనర్ల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. స్థానిక సీసీ కెమెరాలను శోధించారు. ఇంటి నుంచి బయలుదేరిన ముగ్గురు ఆర్టీసి బస్సులో సికింద్రాబాద్‌కు రైల్వే స్టేషన్‌కు వెళ్ళారు. కలకత్తాకు వెళ్ళే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఎక్కినట్లు గమనించారు. రైల్వే పోలీసులను సంప్రదించిన పోలీసుల ప్రత్యేక టీమ్ ఆంధ్ర ప్రదేశ్ ఏలూరు వద్ద రైలును ఆపి ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం హైదరాబాద్‌కు తరలించారు. వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. అందుకు వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి అవసరాలపై ముందస్తు కార్యాచరణ

- రిజర్వాయర్లలో నీటి నిల్వలు - సింగూరు నీటి లభ్యతపై ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్ జూన్ 22 ప్రభాతవార్త

ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి దాన కిశోర్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శ్రీధర్, మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ కృపాకర్‌రెడ్డి, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇరిగేషన్, జలమండలి, మిషన్ భగీరథ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు, వర్షాకాల ప్రవాహాలు, పట్టణ ప్రాంతాల తాగునీటి అవసరాలు, రానున్న వేసవి డిమాండ్‌పై సమీక్ష నిర్వహించారు. కృష్ణా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జల వనరుల ద్వారా 2027 జూన్ నెలాఖరు వరకు హైదరాబాద్‌కు తాగునీటి సరఫరా అందించే అవకాశం ఉందని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. అయితే మంజీరా, సింగూరు జలాశయాల్లోని నిల్వలు 2026 సెప్టెంబర్ 30 వరకు మాత్రమే సరిపోతాయని, గోదావరి వనరుల ద్వారా కూడా అదే కాలం వరకు నీటి లభ్యత ఉందని వివరించారు. వచ్చే వేసవి వరకు హైదరాబాద్ తాగునీటి భద్రత కోసం సింగూరు జలాశయంలో కనీసం 16 టీఎంసీల నిల్వలను కొనసాగించాలని జలమండలి ఇరిగేషన్ శాఖను కోరింది. మిషన్ భగీరథ ఈఎన్‌సీ మాట్లాడుతూ, సింగూరు క్యాచ్‌మెంట్ పరిధిలో నీటి లభ్యత మరో 45 రోజుల అవసరాలకు మాత్రమే సరిపోతుందని తెలిపారు. సింగూరు నీటి వనరులపై ఆధారపడిన ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు (కంటింజెన్సీ ప్లాన్లు) సిద్ధం చేయాలని సూచించారు.

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఉన్నతాధికారులు దాన కిశోర్, శ్రీధర్, కృపాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రంగనాథ్ తదితరులు

అదేవిధంగా గోదావరి నుంచి మిషన్ భగీరథకు అదనపు నీటి సరఫరా కోసం పెండింగ్‌లో ఉన్న సుమారు 4 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులను 40 రోజుల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన సుమారు రూ.3 కోట్ల నిధుల అంశాన్ని కూడా పరిశీలించాలని నిర్ణయించారు. పనులు పూర్తయిన అనంతరం అదనంగా 40 ఎంజీడీల నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మిషన్ భగీరథ పరిధిలో బోర్‌వెల్‌ల వద్ద వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టి భూగర్భజలాల పునర్భరణ పెంచాలని ఆదేశించారు. అలాగే జలమండలి, మిషన్ భగీరథ అధికారులు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు, అవసరమైతే ఇతర వనరుల నుంచి నీటిని మళ్లించే అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు.

కలెక్టర్ మేడం..ఇళ్లు ఎప్పుడిస్తారు..?

-ప్రతి వారం ప్రజావాణిలోనూ వెయ్యికిపైగా దరఖాస్తులు

హైదరాబాద్,జూన్ 22, ప్రభాతవార్త: గ్రేటర్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం పేదలు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇందుకోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లరి గేలా తిరుగుతున్నారు. ప్రజాప్రతినిధులకు వారికి ఏం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటుకున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్లు కావాలని కొందరు, డబుల్‌బెడ్‌రూం కేటాయించాలని మరికొందరు కలెక్టరేట్‌కు క్యూ కట్టారు. తాజాగా హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి లో మొత్తం దరఖాస్తులు 1395 అందగా అందులో హౌసింగ్, 2బిహెచ్‌కేకు సంబంధించి 1171అర్జీలు ఉండటం విశేషం. అలాగే పింఛన్లు 179, రెవిన్యూ శాఖ 16, అలాగే ఇతర శాఖలకు సంబంధించి 29 దరఖాస్తులు అందాయి. వీటిని కలెక్టర్ ప్రియాంక ఆల, అదనపు కలెక్టర్లు కదివరన్ పలని,జితేందర్‌రెడ్డి తదితరులు స్వీకరించారు. ఇలా ప్రతి సోమవారం ఇటు జిహెచ్ఎంసి, అటు కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో పేదలనుంచి దరఖాస్తులు అందుతూనే ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రేటర్ హైదరాబాద్లో అర్హులైన పేదలకు లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలోని పలు లొకేషన్లలో ఇండ్ల నిర్మాణం మొద

మహిళల కోసం సంక్షేమ పథకాలు : కోట నీలిమ

నల్లగుట్ట లో ఇందిరమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న కోట నీలిమ.

బేగంపేట జూన్ 22,ప్రభాతవార్త

మహిళల కోసం ప్రజా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డా.కోట నీలిమ అన్నారు.రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని నల్లగుట్టలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి.ఇందిరమ్మ చీరెల పంపిణీ కార్యక్రమంలో టీ పీ సీ సీ ఉపాధ్యక్షురాలు,సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డా.కోట నీలిమ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక,సామాజిక,అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.మహిళల సంక్షేమానికి దోహదపడే సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్,జీహెచ్ఎంసీ కవాడీగూడా సర్కిల్ డీ పీ ఓ శ్రీలత,సీఓ శ్రీనివాస్ ,కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ చారి,దుర్గయ్య,మాణిక్రం ప్రభు,బలవంత్, రహీం, వినయ్,రఘుయాదవ్,రఘు ముదిరాజ్, వెంకట్,సాదిక్, యాసిన్,వెంకటేష్,జయకృష్ణ,లాలి,అశోక్,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాజీవనాన్ని ఎలా సాగించాలనే అంశంపై శిక్షణ

వంటకాల్లో పాల్గొన్న మహిళలు.

కార్వాన్,జూన్22 (ప్రభాతవార్త) భారతీయ జనతా పార్టీ అనుబంధ గోల్కొండ జిల్లా మహిళా మోర్చా సాంప్రదాయ ఇంధనంతో వంటలపై అవగాహన కార్యక్రమాన్ని లంగర్ హౌజ్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అనుబంధ మహిళ మోర్చా అధ్యక్షురాలు కెంసారం సరళ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళ మోర్చా కార్యదర్శిని రాణి హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భారతదేశంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు ఇంధన లభ్యం లేని సందర్భములో దేశ ప్రజలు సాంప్రదాయ ఇంధనంతో ఏ విధముగా నిత్యా జీవనన్నీ ఎలా ముందుకు సాగించాలనే అంశం పై,దేశ ప్రధాని మోదీ ఇచ్చిన సందేశం మేరకు,ఇంధన రహిత,కట్టెలపోయి వాడి చేసుకునే వంటకాలు,అలాగే నూనె లేకుండా చేసుకునే వంటకాల ఏర్పాటుపై శిక్షణ ఇవ్వడం జరిగింది.వంటల శిక్షణలో భాగంగా మురుమ్రాళ్లు (మర్మరాలు),బ్రెడ్ జామ్,బిస్కెట్,లడ్డూలను తయారు చేసారు.వంటకాల్లో పాల్గొన్న మహిళలకు రాష్ట్ర మహిళ మోర్చా కార్యదర్శిని రాణి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ లంగర్ హౌజ్ డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్,గోల్కొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు కరుణ,కార్యదర్శిని కళ్యాణి, జియాగూడా మహిళ మోర్చా అధ్యక్షురాలు సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య జాతీయ నూతన కార్యవర్గ నియామకం

భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య జాతీయ నూతన కార్యవర్గ నియామకం, చిత్రంలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ కౌటికె విఠల్

చిక్కడపల్లి జూన్ 22 (ప్రభాతవార్త) : భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య జాతీయ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షులుగా సతీందర్ సింగ్ కాలా (ఢిల్లీ), సెక్రటరీ జనరల్‌గా ఎస్.బి. శ్రీనివాస చారి (హైదరాబాద్), జాతీయ ఉపాధ్యక్షులు గా సింగారపు శ్రీనివాస్, జాతీయ కోశాధికారి గా బొడ్డుపల్లి శ్రీరామ్‌లను ఎన్నుకున్నారు.సోమవారం చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్, మాజీ సి ఎల్ ఐ ఏ ఛైర్మన్, అడ్వైజరీ కమిటీ సహ ఛైర్మన్ కౌటికె విఠల్ నూతనంగా ఎన్నికైన వారిని సత్కరించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షులు పి. రామస్వామి, ప్రధాన కార్యదర్శి డి. సునీల్ కుమార్, ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ కేంద్ర ఉపాధ్యక్షురాలు ఈ. హేమలత, జోన్ ఉపాధ్యక్షురాలు ఎ. విజయలక్ష్మి, ఎ. రాణి పద్మజ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడాలి : సీఐ

యూసుఫ్‌గూడ, 22 జూన్, ప్రభాతవార్త : యువత డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటు పడాలని బోరబండ సీఐ సురేందర్ అన్నారు. సోమవారం ఎస్పీఆర్ హిల్స్ మహాత్మా నగర్‌లోని ఎస్వీఎస్ రెడ్ రోజ్ హైస్కూల్‌లో ఎర్పాటు చేసిన డ్రగ్స్ రహిత తెలంగాణ మన అందరి ధ్యేయం కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు ఇక్కడ కూడా మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా జాగ్రత్త పడాలని పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు వారి పిల్లలను గమనిస్తూ ఉండాలని అన్నారు. అదేవిధంగా సెల్‌ఫోన్ల వినియోగం తగ్గించాలని ఫేస్ బుక్కులు, ఇన్‌స్టాగ్రామ్, ఆన్‌లైన్ యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే 1908కు సమాచారం అందివ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. విద్యార్థులు వారి ఏకగ్రత చదువుపై ఉంచి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలలకు తల్లిదండ్రులకు గొప్ప పేరు తెచ్చే విధంగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నీలా రమేష్‌కుమార్, పాఠశాల డైరెక్టర్ వాణిశ్రీ, సీఐ సైదులు, ఎస్సై కాశన్న తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ మృతి

యూసుఫ్‌గూడ, 22 జూన్, ప్రభాతవార్త : గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మోతీనగర్ మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. 2000 సంవత్సరం నుంచి 2004 వరకు నూతన డివిజన్ కౌన్సిలర్‌గా పనిచేశారు. ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అనుచరుడిగా ఆయన ఏపార్టీలో ఉన్నా కృష్ణారావుకు అత్యంత సన్నిహితంగా ఉన్నారు. ఆదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం డీసీ సెస్ అధ్యక్షులుగా, వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉన్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె అమెరికాలో ఉండటంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుమారుడు దినేష్ పేర్కొన్నారు.

విద్యార్థులకు ఉపాధి అవకాశాలే లక్ష్యం

చిక్కడపల్లి జూన్ 22, ప్రభాతవార్త : విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ డిగ్రీ , పీజీ కళాశాలలో నిర్మాణ్ ప్లేస్‌మెంట్ సెల్‌ను సోమవారం ప్రారంభించారు. నిర్మాణ్ సంస్థ, కళాశాల యాజమాన్యం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, హెచ్ఆర్ ప్రతినిధులు, పరిశ్రమల భాగస్వాములు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ, ప్లేస్‌మెంట్ మద్దతు అత్యంత అవసరమని పేర్కొన్నారు. సీఈఓ డాక్టర్ లింబాద్రి విద్యార్థులు ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. నిర్మాణ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ , సిఎస్ఓ సిరపు హరీష్ కుమార్ మాట్లాడుతూ యువతకు నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శకత్వం, ఉపాధి అవకాశాల కల్పనలో నిర్మాణ్ సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఉద్యోగాలు పొందిన విద్యార్థులు, నియామకాల్లో సహకరించిన హెచ్ఆర్ ప్రతినిధులు, సంస్థల భాగస్వాములను సన్మానించాయి. విద్యా సంస్థలు-పరిశ్రమల మధ్య బలమైన అనుబంధం ఏర్పడి యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ డిగ్రీ , పీజీ కళాశాలలో నిర్మాణ్ ప్లేస్‌మెంట్ సెల్‌ను ప్రారంభించిన దృశ్యం

అంగరంగ వైభవంగా శ్రీవారికి శాంతి కళ్యాణమహోత్సవం

సైఫాబాద్, జూన్ 22 ప్రభాతవార్త: హిమాయత్‌నగరంలోని టిటిడి బాలాజీభవన్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాయలం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం తిరునిలయంలో శ్రీవారికి శాంతి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా సన్నాయి మేళాలు, డోలు బజాలు, భక్తుల గోవింద, గోవిందా నినాదాల మధ్య స్వామి వారికి శాంతి కళ్యాణమహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కళ్యాణమహోత్సవంలో జంటనగరాలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు పాల్గొని తిలకించారు. అంతకు ముందు స్వామి వారికి సుప్రభాతం, సర్వ దర్శనం, సహస్రదీపాలంకరణ, ఏకాంతసేవ తదితర పూజా కార్యక్రమాలు దేవాలయంలో యధావిధిగా జరిగాయి. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామిని గజ వహనంపై తీరు వీధుల్లో వైభవంగా ఊరేగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పురవీధులన్ని గోవింద నామాలతో మారుమ్రోగాయి. తదనంతరం తిరునిలయంలో శ్రీవారికి శాంతి కళ్యాణ మహోత్సవం జరిగింది. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీవారి ఊరేగింపు పురవీధుల్లో కొనసాగింది. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు ఉదయం అల్పహారం, మధ్యాహ్నం, రాత్రికి అన్న ప్రసాదాల వితరణ జరిగింది. ఈ సందర్భంగా టిటిడి ఎఈవో యు.రమేష్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసమణికంఠ, లక్ష్మీపతి, ఉద్యోగులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు, బాలాజీభవన్ భక్తుల సొసైటి ప్రతినిధులు శ్రీనివాస్ (వాసు మెడికల్ హాల్), వేణు మనోహర్ తదితరులు భక్తుల సేవల్లో పాల్గొన్నారు.

నేడు శ్రీవారికి పురవీధుల్లో అంగరంగ వైభవంగా రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 23వ తేదీ మంగళవారం ఉదయం 8.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి పురవీధుల్లో అంగరంగ వైభవంగా రథోత్సవం కార్యక్రమం జరగనున్నది. బాలాజీభవన్ భక్తుల సొసైటి ప్రతినిధులు 20 లక్షల వ్యయంతో సుమారు 12 సంవత్సరాల క్రితం నిర్మించి స్వామివారికి కానుకగా అందించిన ఈ రథోత్సవంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఊరేగింపు జరగనున్నది. ఈ రథోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనే అవకాశం ఉంది.

లంబాడ ప్రజాప్రతినిధుల 'బస్సుయాత్ర' అడ్డుకుంటాం : మోతీలాల్ నాయక్

హైదరాబాద్,జూన్ 22,ప్రభాతవార్త: లంబాడ ప్రజాప్రతినిధులు నిర్వహించే బస్సు యాత్రను అడ్డుకుంటామని సేవాలాల్ బంజారా సంఘం అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి లంబాడ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు ప్రభుత్వానికి మద్దతుగా గిరిజన తాండాల్లో ఈ నెల 25 ప్రారంభించ తలపెట్టిన బస్సు యాత్రను అన్ని గిరిజన సంఘాల మద్దతుతో అడ్డుకుంటామని ప్రకటించారు. కాంగ్రేస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల కాలంలో లంబాడాలకు చేసిందేమి లేదని ఆరోపించారు. లంబాడ ప్రజాప్రతినిధులు కనీసం సేవాలాల్ విగ్రహాన్ని హైదరాబాద్ ఏర్పాటు చేయమని ముఖ్యమంత్రికి చెప్పడంలో విఫలమయ్యారన్నారు. కాంగ్రేస్ ప్రభుత్వం ఇచ్చిన చేవెళ్ల డిక్లరేషన్‌కు ఇప్పటికీ మోక్షం లభించలేదని, అయినప్పటికీ లంబాడ ప్రజాప్రతనిధులు తాండాలకు బస్సు యాత్ర కార్యక్రమం రూపొందించడం సిగ్గు చేటన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు లంబాడ ప్రజాప్రతినిధులు ఆరాపడుతూ లంబాడాలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లంబాడ విధ్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం నగరానికి వస్తే కనీసం ఉండేందుకు హాస్టల్ సదుపాయం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉద్యోగాలు లేక యువకులు నగరంలో ఆటోలు నడుపుతు జీవనం సాగిస్తున్నారన్నారు. తమ సంఘం అద్వర్యంలో రెండేళ్లుగా సేవాలాల్ మందిరాన్ని, ఆయన విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.ఈ సమావేశంలో సేవాలాల్ బంజారా సంఘం ప్రధాన కార్యదర్శి ధరావత్ గణేష్ నాయక్, శ్రీను నాయక్, రమేష్ నాయక్, లక్ష్మిబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మోతీలాల్ నాయక్, గణేష్ నాయక్, శ్రీను నాయక్ తదితరులు

డెడ్‌లైన్ పెడుతున్నా.. ప్రత్యక్షంగా నేనే వస్తా : ఎమ్మెల్యే దానం నాగేందర్

జూబ్లీహిల్స్, జూన్ 22, ప్రభాతవార్త: అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులను సహించేది లేదని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులను హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో వెంకటేశ్వరనగర్ కాలనీ డివిజన్లో నెలకొన్ని మంచినీరు, డ్రైనేజీ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాములుచౌహాన్ ఆధ్వర్యంలో వివిధ బస్తీలకు చెందిన స్థానికులు సోమవారం ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. నియోజకవర్గంలోని పలు బస్తీల నుంచి డ్రైనేజీ, రహదారుల తీరుపై వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన ఎమ్మెల్యే దానం జలమండలి, జీహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులకు ప్రత్యక్షంగా ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా పనులు పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఆయన ప్రశ్నించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో నిధులు మంజూరైన అన్ని అభివృద్ధి పనులకు గురువారం, శుక్రవారం శంకుస్థాపన చేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పనులు పూర్తి చేయడానికి డెడ్ లైన్ పెట్టి తానే స్వయంగా పర్యవేక్షిస్తానని అన్నారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గాభివృద్ధి కోసం ఇప్పటికే రూ. 3 కోట్ల నిధులతో అబివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగాయని, మరో రూ. 4 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా శంకుస్థాపన చేసిన పనులు నిలిచిపోయాయన్నారు. ప్రజాసమస్యల కోసం తాము తాపత్రయపడుతుంటే అధికారులకు అదేమి పట్టడం లేదన్నారు. వేసవికి ముందు మంచినీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి నిధులు మంజూరు చేసినా పనులు మొదలు పెట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇక మీదట అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. త్వరలోనే జీహెచ్ఎంసి కమిషనర్, జలమండలి ఎండిని కలుస్తానని, వర్షాకాలం నేపథ్యంలో నాలాలపై ప్రధాన దృష్టి సారించినట్టు తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న నాలా ప్రహరీలు ఉన్నచోట రక్షణ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. బంజారాహిల్స్ నాలా పనులు పూర్తియితే దాదాపు 20 బస్తీలకు ముంపు భయం పోతుందన్నారు. ప్రతాప్‌నగర్‌లో జలమండలి అధికారులు హాస్టళ్లకు బోర్లు వేస్తున్నారని, దీనివల్ల పైబస్తీలకు నీటి సమస్య ఏర్పడుతుందని ప్రతాప్‌నగర్ కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు ఆంథోని, నగేష్ సాగర్, నల్ల శివమాదిగ తదితరులు పాల్గొన్నారు.

రాములుచౌహాన్ తదితరుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయం ముట్టడి

విద్యార్థులను అరెస్టు చేస్తున్న పోలీసులు

సైఫాబాద్, జూన్ 22 ప్రభాతవార్త: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలలను మూసివేత ఆలోచనలను విరమించుకోవాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆనేక మంది విద్యార్థులు పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. అంతకు ముందు విద్యార్థులు కార్యాలయం గేటు ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. కార్యాలయంలోకి వెళ్ళెందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని బలవంతంగా అరెస్టు చేశారు. అంతకు ముందు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ, పుట్ట లక్ష్మణ్ తదితరులు మాట్లాడుతూ పాఠశాల విద్యలో ఉన్న లక్షలాది మంది విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ పరిష్కారించకుండా ప్రసుత్తం ఉన్న 27 వేల పాఠశాలను 4 వేల పాఠశాలలకు తగ్గిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం సిగ్గు చేటని విమర్శించారు. ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల్లో యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజలు, డోనేషన్ల రూపంలో దోపిడీ చేస్తున్నారని, తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేయండి

నవీన్‌మిట్టలతో జెఎసి నేతలు రమేష్, అంజయ్య, శివాజీ, షరీఫ్, పరమేష్

హైదరాబాద్,జూన్ 22,ప్రభాతవార్త: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జెఏసీ ప్రతినిధులు స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఎనర్జీ) సి.నవీన్ మిట్టల్‌ని కలిసి విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన పలు కీలక సమస్యలపై చర్చించారు. ఈమేరకు సోమవారం జేఏసీ చైర్మన్ సిహెచ్.రమేష్, కోచైర్మన్ పి.అంజయ్య, కన్వీనర్ ఎన్.శివాజీ, కోన్వీనర్ నాసర్ షరీఫ్, ఫైనాన్స్ సెక్రటరీ పరమేష్‌లు జయేష్‌రంజన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఉద్యోగులకు ఏప్రిల్ 1 నుండి అమలు కావలసిన పీఆర్సీ కోసం వెంటనే కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చాలా కాలంగా పెండింగ్లో ఉన్న ఈపిఎఫ్,జిపిఎఫ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా వైటీపీఎస్ కోల్ ప్లాంట్ ,యాష్ ప్లాంట్ టెండర్లకు సంబంధించిన అంశాలపై కూడా చర్చిస్తూ, ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనాలని, అవసరమైతే సంబంధిత నిబంధనల్లో మార్పులు చేయాలని కోరారు. ఈసందర్భంగా నవీన్ మిట్టల్ స్పందిస్తూ జేఏసీ ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి యాజమాన్యాలతో చర్చించి త్వరలోనే సానుకూల నిర్ణయాలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

త్యాగరాయ గానసభలో నయనానందకరం రామకథ నృత్య రూపకం

చిక్కడపల్లి జూన్ 22 (ప్రభాతవార్త) : తెలుగు వాగ్గేయ కారుల కీర్తనలకు భక్తి నేపథ్యంగా నాట్య తరంగిణి పెర నటరాజ నాట్య సమితి నాట్య గురువు తరంగిణి శిష్య బృందం కూచిపూడి నాట్య శైలిలో దృశ్య రూపంగా ఆవిష్కరించారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై సుమారు నూట ఏభై మంది యువ కళా కారులు రామ కథ నృత్య రూపకం గా నర్తించి ప్రేక్షకుల్ని ముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలీస్ శాఖ ఉన్నత అధికారి రామదాసు తేజావత్ మాట్లాడుతూ చిన్ననాటనే భారతీయ సంస్కృతి మూలమైన రామాయణ మహా భారత కథలు తెలుసుకునే అవకాశం తల్లి తండ్రులు ఇవ్వాలని వీటి ద్వారా సంఘంలో వారి ప్రవర్తన సంస్కారవంతం గా ఉంటుందని చెప్పారు. మాతృ భాష నేర్చుకొంటూ ఏదో కళలో విద్య తో పాటు ప్రాధాన్యత ఇవ్వాలి అని ఆయన సూచించారు.

లీగల్ సెల్ సలహాదారు వాణి మాట్లాడుతూ స్త్రీ ల ఉన్నత స్థాయికి భర్తల సహకారం ముఖ్యం అన్నారు. తరంగిణి భర్త రాజేంద్రప్రసాద్ సహకారంతో జంట నగరాల లో మూడు నాట్య శాఖలు నడుపుతూ వందల మంది నాట్య కళాకారులను రూపొందిస్తున్నారని అభినందించారు. విద్యా భారతి పూర్వ జాతీయ ఉపాధ్యక్షుడు మురళీ మోహన్ సత్య నారాయణ సంతోష్ గారు తదితరులు పాల్గొనగా నాట్య గురువు తరంగిణి నివేదిక సమర్పించారు.

వర్షపు నీటి సంరక్షణతో అపార్ట్‌మెంట్‌కు జలభద్రత

-ఆదర్శంగా నిలిచిన రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ ప్రాజెక్టు

హైదరాబాద్, జూన్ 22 ప్రభాతవార్త

నీటి కొరతను ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ (రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్) ఎంత ప్రభావవంతమైన పరిష్కారమో ఒక అపార్ట్‌మెంట్ విజయగాథ మరోసారి నిరూపించింది. మాదాపూర్‌లోని బేవర్లీ హిల్స్ ప్రాంతంలో ఉన్న బేవర్లీ స్ప్రింగ్స్ అపార్ట్‌మెంట్ గత వేసవిలో రోజువారీ నీటి అవసరాల కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సి రావడంతో దాదాపు రూ.1 లక్ష వరకు వ్యయం చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితి దీర్ఘకాలిక, స్థిరమైన నీటి నిర్వహణ వ్యవస్థ అవసరాన్ని స్పష్టంగా తెలియజేసింది. ఈ నేపథ్యంలో జలమండలి సాంకేతిక సాయంతో ఓ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్‌తో పాటు ఇంజెక్షన్ బోర్‌వెల్‌ను ఏర్పాటు చేశారు. అలాగే భవనం పైకప్పుల నుంచి వచ్చే వర్షపు నీటిని కేంద్రీకృత హార్వెస్టింగ్ వ్యవస్థకు అనుసంధానం చేసి, భూగర్భ జలాల పునరుద్ధరణకు సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టారు. ఈ చర్యల ఫలితంగా భూగర్భ జల మట్టాలు మెరుగుపడటంతో పాటు బోర్‌వెల్ రీఛార్జ్ సామర్థం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాబోయే వేసవి నాటికి అపార్ట్‌మెంట్‌లో నీటి సమస్యలు గణనీయంగా తగ్గుతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమం ద్వారా ట్యాంకర్లపై ఆధారపడటాన్ని తగ్గించడమే కాకుండా నిర్వహణ వ్యయాలను కూడా గణనీయంగా ఆదా చేసే అవకాశం ఏర్పడింది. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించే దిశగా ఇది ఒక ఆదర్శవంతమైన చర్యగా నిలుస్తోంది.

ముఖ్య ప్రయోజనాలు...

- నీటి ట్యాంకర్లపై ఆధారపడటం తగ్గింది.
- నిర్వహణ వ్యయాల్లో గణనీయమైన ఆదా సాధ్యమైంది.
- భూగర్భ జలాల మట్టాలు మరియు బోర్‌వెల్ రీఛార్జ్ మెరుగుపడింది.
- వర్షపు నీటి సమర్థ వినియోగం సాధ్యమైంది.

-పర్యావరణహిత, స్థిరమైన నీటి నిర్వహణ వ్యవస్థ ఏర్పడింది.

- అపార్ట్‌మెంట్ నివాసితులకు దీర్ఘకాలిక జల భద్రతకు బాటలు పడ్డాయి.

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అపార్ట్‌మెంట్ నివాసితులు, నిర్వహణ కమిటీ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టు రూపకల్పన, అమలులో విలువైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించిన జలమండలి ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి సత్యనారాయణకు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధి గడ్డం ప్రకాష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఇల్లు, ప్రతి అపార్ట్‌మెంట్‌లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలను కాపాడుకోవచ్చు. నీటి సంక్షోభాన్ని నివారించేందుకు ప్రతి పౌరుడు రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్‌ను జీవన విధానంలో భాగంగా చేసుకోవాలని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది.

శ్రీనివాస్ గౌడ్‌కు మాతృవియోగం..పరామర్శించిన తలసాని

**బేగంపేట జూన్ 22,

మహిళాభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుంది : బండి రమేష్

చీరలు పంపిణీ చేస్తున్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 22, ప్రభాతవార్త

తెలంగాణ ప్రభుత్వం మహిళాభ్యున్నతి ధ్యేయంగా పనిచేస్తుందని టీపీసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి కానుక ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం కెపిహెచ్‌బి కాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఉచిత బస్సు ఉచిత విద్యుత్తు గ్యాస్ సిలిండర్ పెట్రోల్ బంకులు ఆర్టీసీ బస్సులను మహిళలకే కేటాయించారన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 70 వేల మంది మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, పిడికిటి గోపాల్ చౌదరి, కిలారు శ్రీనివాస్, బాబు, రంగమోహన్, రజిత, కల్పన, వాణి, సుజాత, వనజ, జ్యోతి, రజిని, మైఖేల్, బాబ్జి, రమణ, వాసు, బొచ్చు మల్లీ, తమ్మినేని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలకు నగర బిగ్గజం మనిధర్‌రావు

అంతర్జాతీయ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ కోసం దక్షణకొరియాకు ఎంపికైన మనిధర్‌రావు , కోచ్ రాహుల్

కుత్బుల్లాపూర్, జూన్ 22 ప్రభాతవార్త

హైదరాబాద్‌కు చెందిన యువకుడు వరల్డ్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ దక్షిణ కోరియాలోని ఇంచియాన్‌కు ఎంపికయ్యారు. జూన్ 22నుండి 29 వరకు ఈపోటీలు జరగనుండగా హైదరాబాద్‌కు చెందిన రాహుల్ స్విమ్ అకాడమి నుండి ఎంపికైన ఏకైన వ్యక్తిగా మణిధర్‌రావు నమోదయ్యారు. ఆయనకు కోచ్‌గా వ్యవహరించిన రాహుల్‌తో కలిసి మణిధర్ రావు దక్షణ కొరియా లోని ఇంచియాన్‌కు వెళ్లనున్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌కు భారతదేశం నుడి ఎంపికైన ఏకైక క్రీడాకారుడుగా మనిధర్‌రావు గుర్తింపు పొందారు. గత పది సంవత్సరాలుగా రాహుల్ స్విమ్ అకాడమిలో శిక్షణ పొందినట్లు వారు పేర్కొన్నారు. సిఐఎంఎఎస్ వరల్డ్‌పిన్‌స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక కావడం ద్వారా జూన్22 నుండి జూన్ 29వరకు జరిగే పోటీలలో పాల్గొంటున్నారు. ఆయనతోపాటు ఆదే అకాడమికి చెందిన రాహుల్ సర్వారియా భారత జట్టుకోచ్‌గా వ్యవహరించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

కాలుష్య నివారణకు చెట్లు ఎంతో అవసరం : ఎమ్మెల్యే శ్రీగణేష్

ఈస్ట్ మారేడ్‌పల్లి పార్కులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

అడ్డగుట్ట,జూన్ 22 ప్రభాతవార్త: మనం నాటే ప్రతి మొక్క రేపటి తరానికి ఆక్సిజన్ సిలిండర్ వంటిదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు.వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఈస్ట్ మారేడ్‌పల్లి టీచర్స్‌కాలనీ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు పాటుపడాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి సర్కిల్ డిప్యూటీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకూ నాయక్, ఆర్టికల్చర్ అధికారి అనీల్, కాంగ్రెస్ నేతలు వైష్ణవి యాదవ్, ధన లక్ష్మి, బద్రి యాదవ్,సంతోష్ యాదవ్, నందికంటి రవి, అల్లాడి గౌరి శంకర్,శ్రీనాథ్,నాగేశ్ యాదవ్, గణేష్ దేవాలయం చైర్మన్ ప్రభాకర్ యాదవ్, గుజ నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన టీపిటీ బకాయిలు వెంటనే చెల్లించాలి : రామకృష్ణ

కంటోన్మెంట్,జూన్ 22 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జె.రామకృష్ణ తెలిపారు. సోమవారం మహేంద్రహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాల క్రితం బోర్డు ఉపాధ్యక్షునిగా, నామినేటెడ్ మెంబర్‌గా ఉన్న సమయంలో మడ్‌పోర్ట్,అంబేద్కర్ నగర్, రక్షణ శాఖ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి తమ హయాంలోనే మంచినీరు, విద్యుత్,టాయిలెట్స్‌వంటి మౌళిక సదుపాయాలు మెరుగుపర్చడంతో పాటు తెల్లరేషన్ కార్డులు ఇప్పించామన్నారు. వారికి భూ బదలాయింపు కింద ఇండ్ల పట్టాలు పంపిణీ చేయాలన్నారు. స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్‌పై అసభ్యకరంగా వేసిన పోస్టర్‌లపై బిజెపి క్రమశిక్షణ కమిటీ విచారణ జరుపుతుందన్నారు. దిగజారే విధంగా అలాంటి చిలిపి చేష్టలు తాను చేయలేదన్నారు. తన ఉపిరి ఉండేంత వరకు బిజెపి పార్టీలోనే కొనసాగుతామన్నారు.

కవాడిగూడ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

ముషీరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గం, కవాడిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌తో కలసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సోమవారం ముందుగా 40లక్షల నిధులతో కవాడిగూడ కేఫ్ చౌరస్తాలోని సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. అనంతరం 12 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన బండమైసమ్మ కమ్యూనిటీ హాల్‌లోని మరుగుదొడ్ల నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. 40 లక్షల వ్యయంతో స్మశాన వాటికలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను, షెడ్డు నిర్మాణ పనులను వారు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చేపట్టిన నూతన అభివృద్ధి పనులను వేగవంతం పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో కవాడిగూడ మాజీ కార్పోరేటరన రచనశ్రీ, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, స్థానిక బీజేపీ నేతలు రమేష్‌రాం, వెంకటేష్, మహేందర్‌బాబు, బీఆర్ఎస్ నేతలు వల్లాల శ్యాంయాదవ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్

ప్రజావాణిలో వినతులు స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ లావణ్య

కొంపల్లి, జూన్ 22, ప్రభాతవార్త

సిఎంసీ కొంపల్లి సర్కిల్-56 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 9 వినతులు అందగా, వాటిలో ప్రధానంగా డ్రైనేజీ, రోడ్లు, పార్కు నిర్వహణ, స్పోర్ట్స్ కాంప్లెక్స్ మరమ్మతులు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, మురుగునీటి లైన్ శుభ్రపరిచే అంశాలు, వీధి దీపాల సమస్యలు, రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.సుభాష్ నగర్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య పరిష్కారం, రోడ్లపై వీధి వ్యాపారుల ఆక్రమణలు తొలగించడం, వాటర్ ప్లాంట్ యజమానుల జలదోపిడీపై చర్యలు, బస్‌స్టాప్ వద్ద ఆటోలను క్రమబద్ధీకరించాలని స్థానికులు వినతులు సమర్పించారు. అలాగే సుభాష్ నగర్ చివరి బస్‌స్టాప్ సమీపంలోని బీటీ రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు.అదేవిధంగా ఎస్.ఆర్. నాయక్ నగర్‌లోని పార్కుకు ప్రహరీ గోడ నిర్మాణం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ గదులకు మరమ్మతులు చేపట్టాలని, సాయిబాబా నగర్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. కొంపల్లిలోని అరుణోదయ రెసిడెన్సీ వద్ద సీవరేజ్ లైన్ శుభ్రపరిచే పనులు చేపట్టాలని, దూలపల్లిలోని గజానన్ హోమ్స్ ప్రాంతంలో వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని, కొంపల్లిలోని రన్‌వే-9 ప్రాంతంలో రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని వినతులు అందాయి. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

జగదీష్ మార్కెట్‌లో నకిలీ ఉత్పత్తుల విక్రయాల గుట్టురట్టు

రూ.12 లక్షల నకిలీ వన్‌ప్లస్ ఉత్పత్తులు స్వాధీనం

హైదరాబాద్, జూన్ 22 ప్రభాతవార్త

ఇందుగలడందులేదని సందేహము వలదు అన్నట్లు.. ప్రతి రంగంలో ఫేక్ మాఫియా పెనవేసుకుపోయింది. తినే ఆహారం నుంచి తాగే నీళ్ల వరకు.. ఉపయోగించే దుస్తుల నుంచి వాడే పరికరాల వరకు.. అన్ని నకిలీనే. ఇప్పటికే ఎన్నో ప్రాంతాల్లో ఎన్నో చోట్ల నకిలీ వస్తువుల గుట్టురట్టయింది.. టాప్ బ్రాండెడ్ నుంచి.. సామాన్యల వస్తువుల వరకు అన్నింటినీ కేటుగాళ్లు అచ్చం అలాంటివే తయారు చేస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ మహానగరంలో నకిలీగాళ్ల గుట్టు మరోసారి బయటపడింది.. అబిడ్స్ జగదీష్ మార్కెట్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఫోన్లు, ఎలక్ట్రిక్ పరికరాలు ఇక్కడ దొరికినన్ని వెరైటీలు ఇంత చవక ధరలో మరెక్కడా దొరకవని అంటుంటారు. అయితే. జగదీష్ మారెనకట్‌లో భారీ నకిలీ ప్రాడక్ట్స్ రాకెట్ బాగోతం వెలుగులోకి వచ్చింది. సోమవారం అబిడ్స్ జగదీష్ మార్కెట్‌లో నకిలీ వన్‌ప్లస్ ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు భారీ దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.12 లక్షల విలువైన నకిలీ వన్‌ప్లస్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, జగదీష్ మార్కెట్‌లో పటేల్ మొబైల్స్ పేరుతో దుకాణం నిర్వహిస్తున్న రామ్ చౌదరి అనే వ్యక్తి గత కొంతకాలంగా వన్‌ప్లస్ కంపెనీ పేరుతో నకిలీ ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను విక్రయిస్తున్నాడు. వినియోగదారులను మోసం చేస్తూ అసలైన వన్‌ప్లస్ ఉత్పత్తుల మాదిరిగానే కనిపించే నకిలీ నెక్‌బ్యాండ్లు, ఇయర్‌పాడ్స్, ఛార్జర్లు, అడాప్టర్లను మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు.ఈ విషయంపై వన్‌ప్లస్ కంపెనీ ప్రతినిధి నాగేశ్వర్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా అబిడ్స్ పోలీసులు దుకాణంపై దాడి నిర్వహించి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పెద్ద మొత్తంలో నకిలీ ఉత్పత్తులు బయటపడ్డాయి. పోలీసులు పెద్ద మొత్తంలో వాటిని స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన వస్తువుల మొత్తం విలువ సుమారు రూ.12 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. అనంతరం రామ్ చౌదరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కేసులో కాపీరైట్ యాక్ట్‌తో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.నకిలీ బ్రాండెడ్ ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని, వినియోగదారులు కూడా కొనుగోలు చేసే ముందు ఉత్పత్తుల ప్రామాణికతను నిర్ధారించుకోవాలని పోలీసులు సూచించారు. ఈ ఘటనతో అబిడ్స్ ఎలక్ట్రానిక్స్ మార్కెట్‌లో నకిలీ ఉత్పత్తుల వ్యాపారంపై మరోసారి చర్చ మొదలైంది.

ఏడు రూపాయల వడ్డీ ఇవ్వాలంటూ మహిళలకు వేధింపులు

జూబ్లీహిల్స్, జూన్ 22, ప్రభాతవార్త:

తాను ఇచ్చిన డబ్బులకు రూ. 7 వడ్డీ కట్టివ్వాలంటూ వేధిస్తూ, బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కరేటి సాహితి అనే మహిళ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. 2008లో పరిచయమైన కందనూరి వెంకటేశ్వర్లు తన వద్ద తీసుకున్న రూ.60 వేల రుణాన్ని అధిక వడ్డీతో తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేస్తూ, అసభ్య పదజాలంతో దూషించడం, వాయిస్ మెసేజ్‌లు పంపడం, బంధువులకు ఫోన్ చేసి వేధించడం, పెట్రోల్ పోసి చంపేస్తానని, రోడ్డుపై హత్య చేస్తానని బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

భూవివాదం నేపథ్యంలో దాడి, నిర్బంధం.. కేసు నమోదు

బంజారాహిల్స్ రోడ్ నం.10లోని 10 ఎకరాల భూమి పరిశీలనకు వెళ్లిన వ్యాపారవేత్త కంజీభాయ్ మొఖారియా, ఆయన సహచరులను 10 నుంచి 15 మంది అడ్డగించి దుర్భాషలాడడంతో పాటు బెదిరించిన ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పార్థసారథి అనే వ్యక్తి చందన్ కుమార్ గోస్వామిపై దాడి చేసి మొబైల్ లాక్కొని, పలువురిని 3 నుంచి 4 గంటల పాటు అక్కడే నిర్బంధించాడు. అనంతరం చంపేస్తామని బెదిరించి అక్కడి నుంచి వారిని తిప్పి పంపించాడు. ఈ ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేయగా పార్థసారథితోపాటు పలువురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంజారాహిల్స్‌లో వ్యభిచార గృహంలో స్పై కెమెరా లభ్యం

ఎవరి కంట పడకుండా వ్యభిచార కేంద్రానికి వెళ్తున్నారా..! అయితే మీరు కెమెరా కళ్లకు చిక్కుతారనే విషయాన్ని గుర్తుంచుకోండి.. బంజారాహిల్స్‌లో ఒక వ్యభిచార కేంద్రంపై దాడి నిర్వహించిన పోలీసులు అక్కడ స్పై కెమెరాలు ఏర్పాటుచేసి ఉండటాన్ని గుర్తించారు.. ఆయా కేంద్రానికి వచ్చిన వారి వీడియోలు అందులో ఉన్నట్లు గుర్తించారు.. బంజారాహిల్స్ రోడ్ నం.10లోని మై హోమ్ అపార్ట్‌మెంట్‌లో పోలీసులు ఒక వ్యభిచార కేంద్రంపై నిర్వహించిన దాడిలో ఈ విషయాన్ని గమనించి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అపార్ట్‌మెంట్‌లో వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి వ్యభిచారానికి పాల్పడుతున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొన్నారు. పోలీసుల దాడిని గుర్తించి ఒక విటుడు వెనుక ద్వారం నుండి పరారయ్యాడు. స్నేహ గౌడ్ అనే మహిళ ఈ వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఘటనాస్థలంలో రెండు మొబైల్ ఫోన్లు, ఒక స్పై కెమెరాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిర్వాహకురాలు పరారీలో ఉండగా మహిళలను పునరావాస కేంద్రానికి తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

తల్లి మృతిని తట్టుకోలేక బాలుడు ఆత్మహత్య

తల్లి మరణాన్ని తట్టుకోలేక ఒక విద్యార్థి తనువు చాలించిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రెండేళ్ల క్రితం తల్లి అనారోగ్యంతో మరణించడంతో బంజారాహిల్స్‌లో నివసించే రహ్మాన్ పటేల్(16) మానసికంగా కుంగిపోయాడు. తల్లి మరణం నుంచి కోలుకోలేకపోయాడు. తల్లిని గుర్తుచేసుకొంటూ ఆమె జ్ఞాపకాల్లోనే జీవిస్తున్నాడు. తీవ్ర మనోవేదనకు గురైన బాలుడు క్రమంగా మానసికంగా కుంగిపోయాడు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలి

బేగంబజార్,జూన్ 22ప్రభాతవార్త: ప్రజలకు మెరుగైన వైద్యం,మందుల సౌకర్యం కల్పించేందుకుగాను భవిష్యత్తులో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కృషి చేయాలని మాజీ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ అన్నారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నేషనల్ హెల్త్ మిషన్ బృందం సోమవారం చిన్నబజార్‌లోని మాజీ కార్పొరేటర్ సున్నంరాజ్‌మోహన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హెల్త్‌మిషన్ బృందంతో సమావేశంలో 45 ఏళ్ల, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు ఎదుర్కొంటున్నఆరోగ్యసమస్యలపై,వారి చికిత్స మందుల అవసరాలు,వైద్యఖర్చుల గురించి సుదీర్ఘంగా చర్చించారు.భవిష్యత్తులో భారత ప్రభుత్వం తరపున ఎలాంటి ఆరోగ్యపథకాలు, సౌకర్యాలను ప్రవేశపెట్టవచ్చుననేఅంశంపై కూడా హెల్త్‌మిషన్ బృందంతో చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌సభ్యులు,మజ్లీస్ అధినేత అసదుద్దీన్,చార్మినార్ శాసనసభ్యులు మీర్‌జుల్ఫకర్‌అలీ సహకారంతో పురానాపూల్ డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు.

మహిళలు సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:

మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. సోమవారం నల్లకుంట టీఆర్‌టీ క్వార్టర్స్‌లో ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద చీరల పంపిణీ కార్యక్రమంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సంక్షేమం, ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలి...

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 22, ప్రభాతవార్త

మేడ్చల్ జిల్లాకు సంబంధించిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కెపి. వివేకానంద్, మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మర్రి లక్ష్మారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు తదితరులు సోమవారం కలెక్ట ర్ మను చౌదరిని కలిసి అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని డబుల్ బెడ్ ఇల్లు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గద్దెనొక్కి రెండున్నర సంవత్సరాలు కాలం గడిచిందని ఇప్పటికీ నగరంలో ఒక్క ఇల్లు అంటే ఒక్కటి కూడా నిర్మించలేదని 420 హామీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేసిందని ఆరోపించారు. తులం బంగారం, మహిళలకు 2500 ఇలా అనేక అబద్ధపు హామీల తో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరుచుకుని ప్రజల పక్షాన ఉండాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎంతో పారదర్శకంగా నిరుపేదలైన అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లాటరీ పద్ధతి ద్వారా అందించామని మిగిలిన ఇళ్లను కాంగ్రెస్ తొత్తులకు కేటాయిస్తున్నారని ఎవరైతే అసలు లబ్ధిదారులు ఉన్నారో వారికి అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కచ్చితంగా నిరు పేదలు ఎవరైతే ఉన్నారో అర్హులందరికీ డబుల్ బెడ్ రూములు కేటాయించాలని 20 లక్షలు ఇల్లు ఇచ్చి ఓట్లు అడుగుతామన్న కాంగ్రెస్ సర్కారు ఎక్కడ ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ మేలుకోవాలని అభివృద్ధికి సంక్షేమ పథకాలకి ప్రజలకు ఎక్కడ ఇబ్బందున్నా కూడా ఊరుకునే ప్రసక్తే లేదని వారు హెచ్చరించారు.

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
గాజులరామారం సర్కిల్-57

NIT No & తేది: 10/DB/EE/గాజుల రామారం సర్కిల్-57/CMC/2026-27
పనిపేరు: LED ఫిక్చర్స్‌ల సేకరణ (1 పనులు) అంచనా మొత్తం లక్షలలో: 11.19 లక్షలు. ప్రారంభ తేది & సమయం: 23.06.2026 మ.2.00గం. బిడ్ స్వీకరణలకు చివరి తేది & సమయం: 30.06.2026 మ.2.30గం. టెండర్ ఆహ్వానించే అథారిటీ వివరాలు మొబైల్ నం.తో: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సెల్ నం: 7893066262, హెడ్ డ్రాట్స్‌మన్ సెల్ నం: 9063836115. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-57, CMC.
DIPR.NO. 4738-PP/CL/ADVT/1/2026-27 తేది: 22.06.2026

తెలంగాణ ప్రభుత్వం
మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ :: ఉప్పల్ సర్కిల్-9

నిట్ నం: టెండర్ ప్రకటన నం. 13/EEC-9/UPL/GHMC/2026-27, తేది: 20.06.2026
పని పేరు: 2 పనుల కొరకు. MMC, ఉప్పల్ సర్కిల్-9, వార్డ్-25, హబ్సిగూడలో నిల్వనీరు తొలగించటానికి, మెయిన్‌రోడ్ హబ్సిగూడలో స్తంభం నం.976 మరియు 977 వద్ద మధ్య సెంట్రల్ మీడియన్ పునర్నిర్మాణం... "MMC, ఉప్పల్ సర్కిల్-9, వార్డ్-25, హబ్సిగూడలో నిల్వనీరు తొలగింపుకు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వద్ద రోడ్ ప్రొఫైల్ సవరణ మరియు 600 mm డయా RCC పైప్‌లైన్ వేయుట" అంచనా మొత్తం: 15.70 లక్షలు. బిడ్స్ స్వీకరణలకు చివరి తేదీ & సమయం: 23.06.2026 సా.04.30 గం. అధికారి పేరు & చిరునామా: శ్రీ జి. హరికిషోర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్-9, MMC. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.Tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్-9, MMC
DIPR.No.4694-PP/CL/Advt/1/2026-27, తేది: 22.06.2026

IN THE COURT OF THE HON'BLE XVIII SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD
O.S. NO. 35 OF 2026
BETWEEN:
K. Saritha ...Plaintiff
And
Padmavathi Pattisapu & Others ...Defendants
NOTICE
To
1. Smt. Padmavathi Pattisapu, W/o. Shiva Pattisapu
2. Shiva Pattisapu, S/o. Bhasker Krishamurthy,
Both R/o. 12-11-1171, Boudha Nagar, Warasiguda, Secunderabad. (Defendant No.1 & 2)
Please take notice that the above named plaintiffs filed the above suit for Cancellation of Sale Deed doct. No. 2080 of 2010 dated 01-12-2010 and the matter is posted for your appearance on 07-07-2026. So you are hereby requested to appear either in person or through Advocate before the Hon'ble Court on 07-07-2026 at 10:30 a.m. failing which the matter will be decided on merits.
(BY ORDER OF THE COURT)
Sd/- B. SUDARSHAN REDDY
Advocate
Flat No.402. Sai Bhavana Heights, Bandlaguda Road, Nagole, Hyderabad-68.
Ph: 9441038189

IN THE COURT OF THE HONOURABLE IX ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD. TS.
M.V.O.P.No. 21 of 2023
Between:-
Naseem Begum. ...Petitioners
and
Aditya Karthik D & others. ...Respondents
To,
M/s HDFC ERGO, General Insurance Co. Ltd., Rep. by its Manager T.P. Claims, 4th Floor Office No. 401 & 406, Kuchkulle, Himayath Nagar, Hyderabad. TS. (Respondent No.3)
Please take notice that the Petitioner has filed the above M.V.O.P. No. 21/2023 against you and others, and the said case is pending, and posted to 30-6-2026 for your appearance, if you fails to appear before the above court on 30-6-2026 at 10-30 A.M, in person or through Counsel, the matter will be decided as per Law.
//BY ORDER OF THE COURT//
Sd/- MOHAMMED AYUB KHAN
Advocate
17-2-790/6/B1, Ground Floor Madannapet, Near Water Tank Saidabad, Hyderabad. TS.
Cell: 9493410787.

ఘనంగా 40వ ఒలింపిక్ డే రన్ -2026

టార్చ్‌లైట్‌ను అందుకుంటున్న మల్లారెడ్డి, స్వర్ణలత తదితరులు

హుడాకాంప్లెక్స్,22 జూన్, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా ఒలింపిక్ సంఘం, జిల్లా క్రీడా శాఖ సౌజన్యంతో 40వ ఒలింపిక్ డే రన్ 2026ను సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ రన్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్టేడియానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా యువజక క్రీడా అధికారి స్వర్ణలత,మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ జయపాల్‌రెడ్డి, బాల్ సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి మనోహార్ కుమార్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం కోశాధికారి రవి కుమార్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల పట్ల అవగాహణ పెంపొందించడం, శారీరక ధృడత్వాన్ని పోత్సహించడం ఈ రన్ యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కోచ్‌లు ,విద్యార్థులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా బాణావత్ బిక్షం నాయక్

హయత్ నగర్, జూన్ 22 ప్రభాతవార్త : గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా అబ్దుల్లాపూర్ మెట్ మండలానికి చెందిన బాణావత్ బిక్షం నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజేంద్ర నగర్లోని ఏ.ఆర్ దేవరాజ్ భవన్లో సోమవారం జరిగిన తెలంగాణ గిరిజన సమాఖ్య రంగరెడ్డి జిల్లా 3వ మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా శంకర్ నాయక్, సహాయ కార్యదర్శిగా ఎల్.శంకర్ నాయక్, కార్యవర్గ సభ్యులుగా సరిలాల్ నాయక్, లచ్చు నాయక్ విజయ్ నాయక్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రామావత్ అంజయ్య నాయక్, సిపిఐ రంగరెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పర్వతాలు హాజరయ్యారు. గిరిజనులు ఎదురుకుంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయాలనీ వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బిక్షం నాయక్ మాట్లాడుతూ... తండల నుండి గూడాల నుండి గ్రామాల నుండి పట్టణాలకి వలస వచ్చిన గిరిజనులు ఏదుర్కొన్న టున్న సమస్యలని గుర్తించి వాటి పరిష్కారం కోసం ఉమ్మడిగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

బాసరలో భక్తి, భరతనాట్యాల వెల్లువ

నేరెడ్ మెట్, జూన్ 22,ప్రభాతవార్త : బాసర జ్ఞాన సరస్వతి క్షేత్ర సమీపంలోని శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమంలో నిర్వహిస్తున్న కోటి పార్థివ శివలింగ శ్రీ మేధా దకిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిర మాసోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దీపారాధన, కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, కోటి పార్థివలింగాలు, శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలకు మహారుద్రాభిషేకం, పుష్పార్చన, బిల్వార్చన, గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు, భూదాన సంకల్ప పూజలు నిర్వహించి మహా అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భువనగిరికి చెందిన ప్రముఖ నాట్య కళాకారిణి, సిరి కూచిపూడి నృత్య నిలయం వ్యవస్థాపక అధ్యక్షురాలు, నాట్య గురువు అనూష గణేష్ శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. ప్రతినెల మూడో ఆదివారం ఉచితంగా ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలకు వేదిక కల్పించనున్నట్లు సిద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాథశర్మ, సంధ్య దంపతులు తెలిపారు. ఆసక్తి గల నాట్య గురువులు 99483 32032 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: చెకొలేకర్ శ్రీనివాస్

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో సన్మానిస్తున్న టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ తదితరులు

మలక్ పేట, జూన్ 22, ప్రభాతవార్త: కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మలక్ పేట నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరుస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. రానున్న గ్రేటర్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషన్ సింగ్, డివిజన్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ గౌడ్, నాయకుడు శ్రీనివాస్ శివకుమార్, షాహిద్ ఖాన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

26న పోచమ్మ దేవాలయంలో అన్నదాన కార్యక్రమం

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చౌకి రవికుమార్, బాబు సుదర్శన్ తదితరులు

మలక్ పేట, జూన్ 22, ప్రభాతవార్త: మలక్ పేట శ్రీ పోచమ్మ దేవాలయంలో ఈనెల 26వ తేదీ శుక్రవారం అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దేవాలయం వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ పేర్కొన్నారు. శ్రీ పోచమ్మ దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో అన్నదానానికి సం బంధించిన కరపత్రాలను దేవాలయం వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, హనుమాన్ దేవాలయం చైర్మన్ బాబు సుదర్శన్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చౌకి రవికుమార్ మాట్లాడుతూ ప్రతినెల చివరి శుక్రవారం దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మని వివరించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాజపేయి, బిక్షపతి, రాజేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు మైనంపల్లి

మల్కాజిగిరి జూన్ 22 ప్రభాతవార్త

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, క్రిషాంక్‌లు కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావుపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మల్కాజిగిరిలో కాంగ్రెస్ నాయకులు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ నేతలు,తమ నాయకుడు మైనంపల్లి హనుమంతరావును విమర్శించే అర్హత కేటీఆర్‌కు,బిఆర్ ఎస్ నాయకులకు లేదన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి,అక్రమ ఆస్తుల వ్యవహారాలు ప్రజలకు తెలుసని, అందుకే ప్రజలు ఆ పార్టీని అధికారానికి దూరం చేశారని విమర్శించారు.అనవసరంగా మైనంపల్లి హనుమంతరావుపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తే కాంగ్రెస్ శ్రేణులు తగిన విధంగా ప్రతిస్పందిస్తాయని హెచ్చరించారు. ప్రజల కోసం నిరంతరం కష్టపడుతూ ప్రజల్లోనే ఉంటూ సేవ చేస్తున్న మా నాయకుడు మైనంపల్లి హనుమంతరావు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తున్నారని చెప్పారు.మైనంపల్లి పై వ్యాఖ్యలు చేస్తూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకులు తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.రాజకీయ విమర్శలు హద్దులు దాటకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మా నాయకుడు పై హద్దులు దాటి మాట్లాడితే ఖచ్చితంగా తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో.... మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్ జితేంద్ర నాథ్,బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి కే శ్రీనివాస్ ఎస్ ఆర్ ప్రసాద్,, సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్,రాందాస్ సంతోష్ ముదిరాజ్, బాబు సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్ సత్యమూర్తి వినోద్ యాదవ్, లక్ష్మీ, ప్రభా, కుట్టి శ్రీనివాస్,సయ్యద్ మబ్బు,బాల్ పి విసత్య నారాయణ,ఫరీద్,పార్థ సారథి, శ్రీకాంత్ ముదిరాజ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

ప్రజల ప్రాణాల కంటే రాజకీయాలు,పదవులే ముఖ్యమా : మంచిరెడ్డి కిషన్ రెడ్డి

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మంచిరెడ్డి కిషన్ రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్, 22, ప్రభాతవార్త : అబ్దుల్లాపూర్మెట్ మండలంలోని లష్కర్‌గూడ, సుర్మాయిగూడ, అనాజ్‌పూర్, మజీద్‌పూర్, గుంతపల్లి, గండిచెరువు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ప్రమాదకర బ్రిడ్జి కారణంగా స్థానిక ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు . బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి మంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అనేక ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ బ్రిడ్జి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారడంతో, ప్రజల సమస్యలను గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడమే కాకుండా టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేసామన్నారు. అయినప్పటికీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో నేటికీ పనులు ప్రారంభం కాకపోవడం దురదృష్టకరం అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేకు ప్రజల సమస్యల కంటే మంత్రి పదవిపైనే ఎక్కువ ఆసక్తి కనిపిస్తోందని విమర్శించారు. శిలాఫలకాలు మార్చడం కాదనీ పనులు చేసి చూపించాలని,గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన నిధులు తామే తెచ్చినట్టు చూపెట్టుకోవడం సరికాదన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం 6.40 కోట్ల నిధుల మంజూరు చేయించి, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు చేతుల మీదుగా శిలాఫలకం వేసి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా ప్రారంభించకపోవడం ప్రజల పట్ల వారి నిరక్ష్యాన్నికి నిదర్శనమన్నారు.వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భారీ వర్షాలు కురిసేలోపు బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభిస్తేనే ప్రజల ప్రాణాలు సురక్షితంగా ఉంటాయని తెలిపారు.గతంలో ఈ బ్రిడ్జి వద్ద జరిగిన ప్రమాదంలో కారు నీటిలో మునిగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనను ప్రభుత్వం గుర్తు చేసుకోవాలని సూచించారు.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే నిరక్ష్యాన్ని బీఆర్ఎస్ పార్టీ సహించదని, వారం రోజుల్లోగా పనులు ప్రారంభించకపోతే భారీ ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.అనంతరం సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, బ్రిడ్జి నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కా రామ్ రెడ్డి,కొత్త కిషన్ గౌడ్,పూజారి చక్రవర్తి, లెక్కల విట్టల్ రెడ్డి,సీక సాయికుమార్ గౌడ్, చెరుకు కిరణ్ కుమార్ గౌడ్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ జోన్‌లో 8 కొత్త క్రీడా మైదానాలు : రాధిక గుప్తా

ఉప్పల్‌లో క్రీడా మైదానాలను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తదితరులు

ఉప్పల్, జూన్ 22 ప్రభాతవార్త : ఉప్పల్ జోన్ పరిధిలో 8 కొత్త క్రీడా మైదానాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటున్నామని జోనల్ కమిషనర్ రాధిక గుప్తా పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు క్రీడా మైదానాలను పలువురు అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఒక్కొ సర్కిల్‌కు రెండు, కామాక్షిపురం, కాకతీయనగర్, కాప్రాలో శ్రీవాసవి శివనగర్, సైనిక్‌పురి, జిఆర్‌రెడ్డినగర్, ఘట్‌కేసర్‌లో ఎల్ఐజి కాలనీ, టిపిఎస్ కృష్ణానగర్ కాలనీ, బోడుప్పల్‌లో లక్ష్మీనగర్ కాలనీలో ఒకటి కొత్త క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఉన్న స్థలాలలోనే స్పోర్ట్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.గత మే స్టాడింగ్ కమిటి అమోదం లభించిందని తెలిపారు. కాగా సోమవారం సత్యనగర్, హరిజన్ బస్తీ, బాగాయత్ క్రీడా మైదానాలు పరిశీలించారు. ఆయా మైదానాలలో అందుబాటులో ఉన్న మౌళిక వసతులు, నిర్వహణ పరిస్థితులు మరియు అభివృద్ధి అవసరాలను పరిశీలించారు. క్రీడాకారులు మరియు స్థానిక యువతకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి, సంబంధిత అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. మైదానాలను పరిశుభ్రంగా, సురక్షితంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉండే విధంగా అభివృద్ధి చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గేమ్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీ విఘ్నేష్, సూపరింటెండింగ్ ఇంజినీర్ హరి కిషోర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగిరెడ్డి,, ఇంజినీరింగ్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొత్త డివిజన్ల సమస్యలు దశల వారీగా పరిష్కారం : నవారు మల్లారెడ్డి

సమస్యలను పరిశీలిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నేత నవారు మల్లారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 22 ప్రభాతవార్త: పునర్విభజన జరిగిన జిహెచ్ఎంసిలో కొత్తగా ఏర్పడిన డివిజన్లలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం దశల వారీగా పరిష్కరిస్తున్నదని బడంగ్‌పేట్ సర్కిల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి స్పష్టం చేశారు. సర్కిల్‌లోని నాదర్‌గుల్ డివిజన్ పరిధి కిందకు వచ్చే అల్మాస్‌గూడ మధురాపూరి, న్యూ మధురాపురి, సిఎంఆర్ కాలనీల్లో స్థానికులతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, వరద నీటి సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తెచ్చారు. ఎస్ఎన్‌డిపి నాలా కోసం తవ్విన రోడ్లను నిర్మించకపోవడంతో వర్షాలు కురిసినప్పుడల్లా ఆయా కాలనీలతో పాటు బోయపల్లి ఎన్‌క్లేవ్, ఆర్‌బిఆర్ కాలనీలు పూర్తిగా బురదమయంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్పందించిన మల్లారెడ్డి మాట్లాడుతూ కొత్త డివిజన్లలో ప్రజా సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం దశల వారీగా చర్యలు చేపడుతున్నదని వెల్లడించారు. కాలనీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి అదే విధంగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కెఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరింపజేస్తామని హామీనిచ్చారు.కార్యక్రమంలో న్యూ మధురాపురి కాలనీ సంక్షే మ సంఘం అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, రేవంత్, యాదగిరి, శ్రీనివాస్ రావు, శ్రీనాథ్, కిరణ్, కైసర్, సుధాకర్‌చారి పాల్గొన్నారు.

పారదర్శకమైన ఓటరు జాబితా తయారీలో బిఎల్ఓల పాత్ర కీలకం: ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

బిఎల్ఓలకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డిఓ జగదీశ్వర్‌రెడ్డి

సరూర్‌నగర్, జూన్ 22 ప్రభాతవార్త: ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడంలో బిఎల్ ఓల పాత్ర కీలకమని కందుకూరు ఆర్‌డిఓ/ ఇఆర్‌ఓ ఎన్.జగదీశ్వర్ రెడ్డి అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఇంటింటి సర్వే కార్యక్రమానికి సంబంధించి సోమవారం బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఆర్‌డిఓ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో బిఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించి కచ్చితమైన సమాచారం సేకరించాలనీ ఈవిషయంలో ఎలాంటి నిర్లక్ష్యంగా గానీ పొరపాట్లకు గానీ తావివ్వవద్దని ఆయన సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ డిప్యూటీ కమీషనర్/ ఎఇఆర్‌ఓ వి.సమ్మయ్య, ఎలక్షన్ డిటి నరేష్, మాస్టర్ ట్రెయినర్లు ఆనంద్ కుమార్, చైతన్యకుమార్, ప్రతాప్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించి సర్కిల్ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు బడంగ్‌పేట్ ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్నందున సంబంధిత ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని డిసి సమ్మయ్య కోరారు.

ఉప్పల్‌లో సర్‌పై రాజకీయ పార్టీలతో సమావేశం

ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీలతో సమావేశమైన జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తదితరుల

ఉప్పల్, జూన్ 22 ప్రభాతవార్త : ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి రాధికా గుప్తా ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జోనల్ కమిషర్ రాధిక గుప్తా మాట్లాడుతూ ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై సరైన సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీలు చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులతో ఫాదర్స్ డే వేడుకలు

విద్యార్థులకు దుస్తులు పంపిస్తున్న మహిళా సంఘం ప్రతినిధులు

ఎల్.బి.నగర్, జూన్ 22 ప్రభాతవార్త: భాగ్యనగర్ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చైతన్యపురిలోని ఆదర్శ అనాథాశ్రమంలోని విద్యార్థులతో కలిసి ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా 30 మంది విద్యార్థులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేసినట్లు భాగ్యనగర్ మహిళా సంఘం ఫౌండర్ ప్రెసిడెంట్ ఉప్పల నిర్మల తెలిపారు. విద్యార్థుల మధ్య ఫాదర్స్ డే పురస్కరించుకుని కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రశాంతిగుప్తా, కోశాధికారి చింతల పావని, వాయిస్ ప్రెసిడెంట్ శ్రీవాణిచౌదరి, అడిషనల్ సెక్రెటరీ పిఆర్.శ్రీదేవి, పిఆర్ఓ శైలజ, ఆర్గనైజర్స్ జయలక్ష్మి, సరోజ, సిహెచ్.శారద, సముద్రాల లక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల దోపిడీని నియంత్రించాలి : పాండుగౌడ్

డీఈఓ వినతిపత్రం అందజేస్తున్న పాండుగౌడ్, జావేద్

ఎల్.బి.నగర్, జూన్ 22 ప్రభాతవార్త: ప్రైవేటు యాజమాన్యాలను నియంత్రిస్తేనే పేద వర్గాలకు విద్య అందుబాటులో ఉండే అవకాశం ఉంటుందని వెంటనే తగ్గించాలని బిఆర్ఎస్‌వి జిల్లా అధ్యక్షుడు గుండమల్ల పాండుగౌడ్ పేర్కొన్నారు. ప్రవేటు పాఠశాలల్లో ఇష్టారీతిన వసూలు తీరును వ్యతిరేకిస్తూ, ఫీజులను నియంత్రించాలని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లుకు సోమవారం బిఆర్ఎస్‌వి నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపౌరుడు చదువుకునే హక్కు భారత రాజ్యాంగం కల్పిస్తుంది కాని ప్రబుత్వం దాన్ని కాలరాస్తూ ఫీజుల భారాన్ని తల్లిదండ్రులుపై మోపుతుందన్నారు. ప్రైవేటు యాజమాన్యాలతో ప్రబుత్వ పెద్దలు కుమ్మకై విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 27వేల ప్రబుత్వ బడులల్లో 23వేల బడులను మూసేస్తామని ఇస్తున్న సంకేతాలు పేదలకు ఉచిత విద్యను దూరం చేస్తూ ప్రైవేటు యాజమాన్యాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలను నియంత్రించి, ప్రబుత్వ విద్యను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందొళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి చటారి దశరథ్, ఎండి.జావేద్, గుఫ్రోద్దీన్ పటేల్, ప్రశాంత్,వొల్లాల్ల క్రాంతి, పాల్గొన్నారు.

రూ.21లక్షలతో కమ్యూనిటిహాల్ పనులు

రామంతాపూర్ భరత్‌నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేత వల్లపు శ్రీకాంత్ యాదవ్ తదితరులు

రామంతాపూర్, జూన్ 22 ప్రభాతవార్త : రామంతాపూర్ భరత్ నగర్ కమ్యూనిటీ హాల్ పనులను సోమవారం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఇంచార్జీ ఎం, పరమేశ్వర్ రెడ్డి సహకారంతో రూ. 21లక్షల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. ఇప్పటికే పనులు మొదలు పెట్టేందుకు కాలనీ పెద్దలు, ప్రజలతో మాట్లాడి చర్యలు తీసుకున్నామని, సోమవారం భరత్ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద అదనపు నిర్మాణం పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు అధ్యక్షులు లక్ష్మణ్, శ్యామ్ గౌడ్, రాజకుమార్, అరుణ్, రవీందర్ రావు, జోగులా వెంకటేష్, శగా రవి, వాసు, నాగి రెడ్డి, అరవింద్ స్వామి, బాలు రెడ్డి, ముత్యం రెడ్డి, తీర్థ, బాలరాజు, సత్యనారాయణ, సునికి రెడ్డి,జంగయ్య, వెంకటరమణ, రాయప్ప, సీత్తయ్య, ముత్యాల సత్యనారాయణ మరియు కాంగ్రెస్ నాయకులు శామ్యూల్, రాజి రెడ్డి, జంగయ్య, శ్రీధర్, జంగయ్య, బాబురావు, బుల్లెట్ అశోక్, శంకర్, గౌతమ్, కిరణ్,క్రాంతి పాల్గొన్నారు.

కొత్తకాపు సోదరులను పరామర్శించిన తీగల

కమలమ్మ భౌతికకాయానికి నివాళులర్పించి కొత్తకాపు సోద